




మాటాడ్లుతున్న సతీష్‌కుమార్

## విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అవసరం

- కిట్స్ కార్యదర్శి వీ సతీష్‌కుమార్

హుజూరాబాద్ రూరల్,జనవరి27: పరిశ్రమలకు కావలసిన నైపుణ్యం గల మానవ వనరులను అందించేందుకు విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అవసరమని కిట్స్ కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ కుమార్ పేర్కొన్నారు. సింగాపూర్ కిట్స్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం వారు అటల్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం 'అడ్వాన్సస్ ఇన్ మ్యానుఫ్యాక్చరింగ్ అండ్ ఇండస్ట్రీ 4.0 సినారియో ' పేరిట ఆరు రోజుల కార్యశాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే శంకర్ అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. పరిశ్రమలలో వస్తున్న నూతన సాంకేతిక విజ్ఞానాన్ని నేర్చుకొని విద్యార్థులకు బోధించినచో పరిశ్రమలకు నైపుణ్యం గల మానవ వనరులు దొరుకుతాయన్నారు. ఇక్కడ మెకానికల్ ఇంజినీరింగ్ సమన్వయకర్త రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే ఈశ్వరయ్య , మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎంవి సతీష్ కుమార్, ప్రొఫెసర్ మల్లయ్య, అధ్యాపకులు ఉన్నారు.

## యూజీసీ ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కమాన్‌చౌరస్తా, జనవరి 27: సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న యూజీసీ గైడ్‌లైన్స్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరపు వెంకటేశ్, మచ్చ రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా సమితి ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని విఘాతం కలిగిస్తున్న యూజీసీ గైడ్ లైన్స్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, యూనివర్సిటీల వీసీల నియామకాల్లో రాష్ట్రాలకు స్వేచ్ఛనివ్వాలని, రాజకీయాలకు అతీతంగా విద్యారంగానికి సంబంధించిన వారినే నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, ఉపాధ్యక్షుడు కనకం సాగర్, జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు, ఏఐఎస్ఎఫ్ నాయకులు మచ్చ పవన్, కళ్యాణ్, బోయిని విష్ణువర్ధన్, ప్రనిష్, మహేష్,రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### విచ్ఛిన్నం చేసే ప్రక్రియ..

యూజీసీ మార్గదర్శకాలను తీసుకురావడం విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసే ప్రక్రియ అని, దాని ద్వారా యూనివర్సిటీలలో స్వయం ప్రతిపత్తిని కోల్పోయే అవకాశం ఉంటుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం యూజీసీ మార్గదర్శకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## కాల్వలో తెగిపడ్డ 33కేవీ లైన్

ముకరంపుర, జనవరి 27: కరీంనగర్ నుంచి బద్దిపల్లికి వెళ్లే 33కేవీ లైన్ చింతకుంట కెనాల్ మీదుగా వెళ్తున్నది. సోమవారం ఒక్కసారిగా తెగిపోయి పక్కనే ఉన్న కాకతీయ ప్రధాన కాల్వలో పడిపోవడంతో సమస్య ఏర్పడింది. బద్దిపల్లితో పాటు ఆచంపల్లికి సరఫరా నిలిచిపోయింది. కాల్వలో పడిపోయిన తీగను బయటకు తీసి లైన్‌కు మరమ్మతు చేస్తే తప్ప సరఫరాను పునరుద్ధరించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బద్దిపల్లి ఏఎల్ఎం రాజు నీళ్లు నిండుగా ఉన్న కాల్వలోకి తాడు సాయంతో దిగి ఈత కొడుతూ అవతలి వైపున నీళ్లలో పడిపోయిన 33కేవీ తీగను బయటకు తీసుకువచ్చారు. మరమ్మతులు చేపట్టి సాయంత్రం సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా రాజును కరీంనగర్ రూరల్ ఏడీఈ రఘుతో పాటు ఏఈలు అభినందించారు.

# నగర'పాలన' నేటితో సమాప్తం

- ముగియనున్న పాలకవర్గాల పదవీ కాలం
- 'ప్రత్యేక' పాలనలోకి కరీంనగర్ కార్పొరేషన్
- బీఆర్ఎస్ హయాంలో గణనీయమైన ప్రగతి
- మారిన నగర రూపురేఖలు
- ప్రభుత్వ మారడంతో ఏడాదిగా అభివృద్ధికి బ్రేక్
- ఎక్కడి పనులు అక్కడే



కార్పొరేషన్, జనవరి 27: మరికొద్ది గంటల్లోనే కరీంనగర్ నగరపాలక సంస్థ పాలకవర్గం పాలన ముగుస్తున్నది. మంగళవారంతో పదవీకాలం సమాప్తం కాబోతున్నది. బుధవారం ప్రత్యేక అధికారి పాలన అమల్లోకి రాబోతుండగా, గడిచిన ఐదేండ్లలో బీఆర్ఎస్ సర్కారు హయాంలో నగరం ప్రగతిలో దూసుకెళ్లింది. అప్పటి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రత్యేక చొరవతో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. అప్పటి సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సైతం కరీంనగర్ అభివృద్ధి విషయంలో ప్రత్యేకంగా సానుకూలంగా స్పందించడంతో నిధుల వరద పారింది.

### నగర పాలక చరిత్రలోనే భారీ అభివృద్ధి

నగరపాలక చరిత్రలోనే ఎప్పుడూ లేనివిధంగా భారీ ఎత్తున్న అభివృద్ధి జరిగింది. నగర రూపురేఖలు పూర్తిగా మార్చేందుకు నేతలు అలుపెరుగని కృషి చేశారు. పాలకవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించిన రెండు నెలలకే మాయదారి కరోనా ప్రపంచాన్నే వణికించింది. దేశంలోనే మొదటి 11 కేసులు కరీంనగర్‌లోనే బయటపడ్డాయి. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే, స్థానిక జిల్లా యంత్రాంగం, అధికారులు, ప్రజాప్రతినిధులు అందించిన సేవలను నగర ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేరు. కరోనాతో రెండేళ్ల కాలం గడిచిపోయినా, నగరంలో ఎక్కడా అభివృద్ధికి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టారు. స్మార్ట్‌సిటీ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా రూ.350 కోట్ల సీఎం అస్యూరెన్స్ నిధులు, పట్టణ ప్రగతి, హరితహారం నిధులు భారీగా సమకూరగా, సద్వినియోగం చేసుకునే విషయంలో వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారు. సరికొత్త అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోనే ప్రతి రోజూ మంచినీరు అందించే నగరంగా కరీంనగరాన్ని తీర్చిదిద్దారు. ఆ రోజు చేపట్టిన పనులతోనే ప్రస్తుతం మూడేండ్లుగా నిర్విరామంగా నగర ప్రజలకు మంచినీటి సరఫరా జరుగుతున్నది. అలాగే హరితహారంలో పెద్ద సంఖ్యలో మొక్కల పెంపకాన్ని చేపట్టారు. పెద్ద సంఖ్యలో రోడ్లు, డ్రైనేజీలు, మౌళిక సదుపాయాలను కల్పించారు. ప్రజల ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్స్, వాకింగ్ ట్రాక్స్, మోడల్ పబ్లిక్ టాయిలెట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. నగరవాసులకు పరిశుభ్రమైన వాతావరణంలో అన్ని రకాల ఆహార పదార్థాలు ఒకే చోట దొరికేలా నాలుగుచోట్ల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. పద్మనగర్ మార్కెట్ ప్రస్తుతం అందుబాటులోకి రాగా, మిగిలిన మూడు నిర్మాణ దశల్లోనే ఉన్నాయి. నగర ప్రజల ఉల్లాసానికి పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దారు. నగరంలోని చౌరస్తాలకు ఆధునిక సోగబులద్ది సుందరంగా మార్చారు. పారిశుధ్య నిర్వహణలోనూ యాంత్రీకరణ చేపట్టి మెరుగైన పరిశుభ్రత కల్పించారు. ఇందుకోసం ప్రత్యేకంగా నూతన ట్రాక్టర్లు కొనుగోలు చేయడంతోపాటు స్వచ్ఛ ఆటోలను తీసుకువచ్చారు. స్వీపింగ్ యంత్రాలను పెద్ద సంఖ్యలో వినియోగంలోకి తెచ్చారు. మొదటి సారిగా నగరంలో డిజాస్టర్ రిసోర్స్ పోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధం చేశారు. ప్రకృతి విపత్తులు జరిగిన సందర్భాల్లో తక్షణమే స్పందించే విధంగా ఆయా విభాగానికి ప్రత్యేకంగా వాహనాలు, సామగ్రిని అందించారు. ఇలా లెక్కలేనన్ని పనులతో నగర రూపురేఖలు మారిపోయాయి.

### ఏడాదిగా నిలిచిన అభివృద్ధి

నగరపాలక సంస్థలో బీఆర్ఎస్ హయాంలో మూడేళ్ల పాటు వేగంగా సాగిన అభివృద్ధి ఏడాదిగా నిలిచిపోయింది. ప్రభుత్వం మారడంతో ప్రగతికి బ్రేక్ పడింది. ముఖ్యంగా సీఎం అస్యూరెన్స్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. ఫలితంగా ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నగరపాలక సంస్థలోనూ నిధుల లేమితో నిర్వహణ వ్యయాలకే పరిమితమవుతూ వస్తున్నది. ఈ నెల 28తో పాలకవర్గ పదవీ కాలం ముగుస్తుండడంతో ప్రభుత్వం నగర పాలక సంస్థకు ప్రత్యేక అధికారిగా కలెక్టర్ ప్రమేలా సత్పతిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కాగా, రాబోయే కాలంలో నగరంలో ఏ మేరకు అభివృద్ధి పనులు కొనసాగుతాయో..? వేచి చూడాల్సి ఉన్నది.

# 'నాగంపేట'పై ఏసీబీ నజర్?

- జీపీలో నిధుల అవకతవకలపై ఆర్టీఐ దరఖాస్తు నేపథ్యంలో ఫిర్యాదులు

జమ్మికుంట, జనవరి27: నాగంపేట గ్రామపంచాయతీలో అవకతవకలు జరిగాయా..? వచ్చిన నిధులు.. అభివృద్ధి పనుల్లో జరిగిన ఖర్చులో గోల్‌మాల్ జరిగిందా..? నెలలు గడిచినా ఇప్పటి వరకు ఆర్టీఐ దరఖాస్తుదారుడికి అడిగిన వాటికి సమాధానం ఇవ్వడం లేదా..? అంటే అవుననే సమాధానా లు వినిపిస్తున్నాయి. ఇదే నేపథ్యంలో ఆర్టీఐ అంశాలపై జిల్లా ఉన్నతాధికారులకు, ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. దీంతో 'నాగంపేట'పై ఏసీబీ నజర్ వేసినట్లు సమాచారం. కాగా, గ్రామ పంచాయతీ నిధులపై స మాచార హక్కు చట్టం ప్రకారం ఓ వ్యక్తి దరఖాస్తు చేయగా, ప్రస్తుతం పనిచేస్తున్న కార్యదర్శికి బదులు బదిలీపై వెళ్లిన కార్యదర్శి సమాధానం ఇవ్వడంపై గత డిసెంబర్ 18న 'నమస్తే తెలంగాణ'లో కార్యదర్శి ఒకరు.. సమాధానం మరొకరిది' వార్తా కథనాన్ని ప్రచురించింది. దీంతో మండలాధికారులు తూతూమంత్రంగా నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. సం తృప్తి చెందని ఉన్నతాధికారులు, రంగంలో దిగినట్లు సమాచారం. మంగళవారం నాగంపేట గ్రామ పంచాయతీకి జిల్లా అధికారులు రానున్నట్లు తెలిసింది. పంచాయతీలో నిధులు, అభివృద్ధి పనులు, తదితర అంశాలతో పాటూ పనిచేస్తున్న కార్యదర్శి, బదిలీ కార్యద ర్శి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న తీరుపై విచారణ చేయనున్నట్లు తెలిసింది. ఇదే సమయంలో ఏసీబీ అధికారులు కూడా గ్రామంలోని పలువురు బాధితులను కలువనున్నట్లు సమాచారం. ఏది ఏమైనా నాగంపేటపై ఉన్నతాధికారులు, ఏసీబీ నజర్ పడడం కలకలం రేపుతున్నది.

## ఆర్టీసీ నిర్వీర్యానికి కాంగ్రెస్ కుట్రలు



సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

తెలంగాణచౌక్, జనవరి27: ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని, సంస్థకు చెందిన విలువైన స్థలాలను తన అనుచర గణానికి కట్టబెట్టడానికి ప్రయత్నస్తున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ఆరోపించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా కమిటీ సభ్యులతో కలిసి నిర్వహించిన విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటీకరణ ప్రోత్సహిస్తున్నదని మండిపడ్డారు. ఆర్టీసీ చెంది న 22 బస్సు డిపోల్లో 66 ఎకరాల ఖాళీ స్థలాన్ని లీజు పేరిట ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని చూస్తున్నదని ఆరోపించారు. సంస్థ స్థలాన్ని లీజుకు ఇస్తే ఊరుకోబోమని, అందులో కాంప్లెక్స్‌లు కట్టి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలును మెగా, జేబీఎం సంస్థలను అప్పగించడం ద్వారా నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతున్నదని, బస్సుల నిర్వహణ పూర్తిగా ఆర్టీసీ పరిధిలో జరుగాలని సూచించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ ఆర్టీసీ యూనియన్లు సమ్మె నోటీసు ఇచ్చాయని, వారికి పార్టీ మద్దతు ఇస్తుందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని ఆర్టీసీ ప్రైవేటీకరణ చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్‌కుమార్, నగరం కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# సీఐ లంచం ఆరోపణలపై ఏసీపీ విచారణ

హుజూరాబాద్, జనవరి27: జమ్మికుంట పట్టణ సీఐ వరగంటి రవిపై వచ్చిన లంచం ఆరోపణల నేపథ్యంలో హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో ఏసీపీ కార్యాలయంలో సోమవారం విచారణ చేశారు. సీఐపై ఆరోపణలు చేసిన షేక్ సాబీర్ అలీ విచారణకు హాజరయ్యాడు. కొద్ది రోజుల నుంచి షేక్ సాబీర్ అలీ అనే సామాజిక కార్యకర్త ఓ కేసు విషయంలో మధ్యవర్తిత్వం వహించి రూ.3లక్షల లంచం ఇచ్చానని, సీఐ కార్యాలయంలోని బాత్రూం బకెట్లో పెట్టానని పట్టణ సీఐ రవిపై ఆరోపణలు చేశారు. ఆ టైంలో సీఐతో సాబీర్ అలీ మాట్లాడిన ఫోన్‌కాల్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలన్నీ తెలిసిందే. ఈ నేపథ్యంలో సాబీర్ అలీని ఏసీపీ కార్యాలయానికి మధ్యాహ్నం 3:30 గంటలకు రావాలని, విచారణలో వివరాలు అందించాలని పోలీసు అధికారులు కోరినట్లు సమాచారం. ఇదే విషయాన్ని సైతం సాబీర్, ఓ వీడియోను విడుదల చేసి విచారణకు వెళ్లాడు. విచారణ నుంచి బయటకు వచ్చిన తర్వాత సాయంత్రం సాబీర్ మరో వీడియో విడుదల చేశారు. విచారణకు వెళ్లిన తనను ఏసీపీ, తదితరులు 70 ప్రశ్నలు అడిగారని, ప్రతి ప్రశ్నకు ఆధారాలతో కూడిన సమాధానం ఇచ్చానని తెలిపాడు. సీఐపై వెంటనే విచారణ జరిపి, కేసు నమోదుతో పాటూ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశాడు. చర్యలు తీసుకోకుంటే సామాజికంగా ఉద్యమిస్తానని అందులో పేర్కొన్నారు. ఏదిఏమైనా జమ్మికుంట సీఐ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీనిపై 'నమస్తే' హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీని వివరణ కోరగా, విచారణకు పిలిచింది వాస్తవమేనని, అయితే సీఐపై ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు అందించలేదని తెలిపారు.